'మిచాంగ్' తుపాన్ 'అప్రమత్తం'

- మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దు
- గర్భిణులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలి
- జిల్లా ప్రజానీకానికి కలెక్టర్ సూచనలు

శ్రీనివాస సేథు పైనుంచి వర్షధార

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'చెన్నయ్-నెల్లూరు మధ్య మిచాంగ్ తుపాను తీరం దాటే అవకాశం ఉంది. కావున శని, ఆది, సోమవారాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.. మత్స్యకారులో సముద్రంలో వేటకు వెళ్లరాదు.. 50-70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలవారు పునరావాస కేంద్రాలను వినియోగించుకోవాలని, గర్భిణులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలి' అని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి జేసీ డికె బాలాజీతో కలిసి జిల్లా ప్రజానీకాన్ని అప్రమత్తం చేశారు. ఐఎండి హెచ్చరికల నేపథ్యంలో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి మండల, గ్రామస్థాయిలో ఉన్న అధికారులను అప్రమత్తం చేశారు. సోమ, మంగళవారాల్లో పిల్లలు, గర్భిణీలు, చిన్నపిల్లల తల్లులు, వృద్ధులు బయటకు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో 24 గంటలూ వసతి, ఫుడ్, ఇతర మెడికల్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పది రోజుల్లో డెలివరీ అయ్యే గర్భిణీలను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆస్పత్రులకు తీసుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. పూరిగుడిసెల్లో ఉన్నవారు, కచ్చా గృహాల్లోని వారు పునరావాస కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిత్యావసరాల పంపిణీ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

తిరుపతిలో భారీ వర్షం

తిరుపతి నగరంలో భారీ వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటలు వరకు వర్షం కురవడంతో నగరంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వర్షం కారణంగా నగరంలో పలు రోడ్లు చెరువులను తలపించాయి. ముఖ్యంగా తిరుమల బైపాస్ రోడ్ లోని శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మహతి ఆడిటోరియం రోడ్డు వర్షపు నీరు రోడ్లపై చేరడంతో వాహనాదారులకు రోడ్లు కనపడకుండా పోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. లక్ష్మీపురం సర్కిల్ వద్ద ఉధృతంగా వర్షం నీరు ప్రవహించడంతో ట్రాఫిక్ పోలీసులు మార్గాన్ని తాత్కాలికంగా మూసివేశారు. డి ఆర్ మహల్ అండర్ రైల్వే బ్రిడ్జి వర్షపు నీరు చేరుకోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రాయల్ చెరువు అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వద్ద కూడా వర్షం నీరు చేరడం ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారింది. వెస్ట్ చర్చి రైల్వే బ్రిడ్జి వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు వర్షపు నీటిని తోడివేశారు.

- తీరప్రాంత గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ శ్రీదేవి తెలిపారు. పశువుల కాపర్లు మేత కోసం అడవులకు, వాగులు వంకల వద్దకు పోవద్దని సూచించారు.
- తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ భార్గవి, ఎస్ఐ వెకంట నరసింహం విజ్ఞప్తి చేశారు. దూర ప్రయాణాలు ఉంటే వాయిదా వేసుకోవాలని సూచించారు. వీధుల్లో మురికినీరు చేరిన వెంటనే పంచాయతీ సర్పంచులు వాటిని తొలగించేలా చూడాలన్నారు. విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎఇ పుణ్యకోటి సూచించారు. విద్యుత్ స్తంభాలు, వైర్లు తెగిపోవచ్చని, వాటిని ముట్టుకునే ప్రయత్నం చేయరాదని హితవు పలికారు.
- వాగులు వంకలు వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట ఎంపిడిఒ భవాని, డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావు, ఎస్ఐ పుల్లారావు సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు తహశీల్దార్ బాల లీలారాణి సూచించారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్

కంట్రోల్ రూమ్ నెంబర్: 9491077356

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులతో మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారుతున్న నేపథ్యంలో ఈ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాస్థాయి అధికారులు మొదలు మండలస్థాయి అధికారులు, గ్రామస్థాయి వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, కంట్రోల్ రూమ్ నెంబర్ 9491077356 అని తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని జలాశయాల వద్ద మరియు చెరువుల వద్ద నీటి నిల్వ సామర్థ్యం ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, వాగులు వంకలు వద్ద ప్రజలు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్

లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: బంగాళాఖాతంలో తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే హెచ్చరికల నేపథ్యంలో నగరపాలక అధికారులు, యంత్రాంగం క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. శనివారం సాయంత్రం కమిషనర్ నగరంలోని తేనబండ రోడ్డు వంతెన, వీరభద్ర కాలనీ, నీవానది కల్వర్టు తదితర లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలువకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నీవానదిలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. వర్షాల నేపథ్యంలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రత్యేక అత్యవసర బందాలను ఏర్పాటు చేయాలన్నారు. విభాగాధిపతులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితి అంచనా వేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ గోమతి, డీఈ వెంకటప్రసాద్, సానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరపాలక కార్యాలయంలో
కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చిత్తూరుఅర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగరపాలక కార్యాలయంలో నగర ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. వర్షాలు నేపథ్యంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే నగరపాలక కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 98499 07885, 08572- 232745కు సమాచారం ఇవ్వాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యల కోసం ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఫేస్ యాప్‌తో ఇబ్బందులు

డీఈఓకు ఫ్యాప్టో నేతల వినతి

డీఈఓకు వినతి పత్రం అందిస్తున్న ఫ్యాప్టో నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఫేస్ యాప్ వల్ల ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందంటూ ఫ్యాప్టో నేతలు జీవి రమణ, కిరణ్ కుమార్ శనివారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని మారుమూల ప్రాంతాల్లో ఫేస్ యాపులు పనిచేయక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కొంతమంది ఉపాధ్యాయులు ఇంటర్‌నెట్ పనిచేయని కారణంగా ఫేస్‌యాప్ నమోదు చేయలేకపోయారని ఇలాంటివారు సంజాయిషీ ఇవ్వాలంటూ విద్యాశాఖ నుండి వివరణ కోరడం సరికాదని అన్నారు. విజ్ఞతతో ఉపాధ్యాయులకు ఇచ్చిన సంజాయిషీ నోటీసులు వెనక్కి తీసుకోవాలని కోరారు.

పిఇఎస్‌లో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

విజేతలకు అవార్డు ప్రదానం చేస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: యాదమరి మండలం మోర్ధాన్‌పల్లి వద్ద ఉన్న పిఇఎస్ పబ్లిక్ స్కూల్లో బాస్కెట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలు ఘనంగా నిర్వహించారు. వివిధ జిల్లాలకు చెందిన పాఠశాల స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారులు 40 చెట్లు పాల్గొన్నారు. ఫైనల్‌కు చేరిన జట్ల మధ్య పోటీ శనివారం నిర్వహించారు. పిఇఎస్ పబ్లిక్‌స్కూల్, ఆర్కే మోడల్‌స్కూల్, ధర్మవరం కాకతీయ నికేతన్ స్కూల్ గుడివాడ ఫైనల్స్‌కు చేరాయి. ఫైనల్స్‌లో బాలబాలికల విభాగంలో గుడివాడ మ్యూటని స్కూల్, ఆర్కే మోడల్ స్కూల్, ధర్మవరం కాకతీయ స్కూల్, పిఇఎస్ పబ్లిక్ స్కూల్ రన్నర్స్‌గా నిలిచాయి. రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ముఖ్య అతిథులుగా చిత్తూరు నగర కమిషనర్ అరుణ, బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు చెంగల్రాయ నాయుడు, ఏఎస్‌పి నాగేశ్వరరావు, స్థానిక తెలుగుదేశం నాయకులు జయప్రకాష్, పిఈఎస్ పబ్లిక్‌స్కూల్ డైరెక్టర్ సత్యనారాయణ, స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణబాబు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలి: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కట్టమంచి నగరపాలక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు అందించిన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడంతో పాటు విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వారితో సరదాగా మాట్లాడారు. కమిషనర్ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడారు. రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా ఇప్పటినుండే ప్రణాళిక ప్రకారం విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. పరీక్షలు అంటే ఉన్న భయాన్ని తొలగించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులను తగిన విధంగా ప్రోత్సహించి ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, సీఎంఎం గోపి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూమి మనిషి విలువను పెంచుతుంది: జెసి

రైతులకు పట్టాల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: భూమి మనిషి విలువ పెంచుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో నియోజకవర్గంలోని భూమిలేని పేదలకు భూ పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే ఎమ్మెస్.బాబు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జెసి శ్రీనివాసులు మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలో భూమిలేని750మంది నిరుపేదలకు లబ్ధిదారులకు 850 ఎకరాలు భూపంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అందులో బంగారుపాళ్యంకు సంబంధించి 525 మందికి 611.80 ఎకరాలు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. భూమిలేని నిరుపేదలకు భూమి వలన గ్రామంలో విలువ పెరుగుతుందని, భూమిని సాగు చేసుకుని పంటలు పండించుకుని అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం పట్టాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమరావతికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్‌రాజా జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జడ్పిటిసి సోమశేఖర్ భారతి, పలమనేరు, చిత్తూరు ఆర్డీవోలు మనోజ్ కుమార్ రెడ్డి, చిన్నయ్య, తహశీల్దార్లు అనిల్ కుమార్, హనుమంతప్ప, సుశీలమ్మ, విజయ్ భాస్కర్, గుణశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: పలమనేరు నియోజకవర్గంలోగల మండలాలకు సంబంధించి భూములు లేని పేద రైతులకు 357 మందికి నియోజకవర్గ పరిధిలో 347.25ఎకరాల ప్రభుత్వ భూములను భూపంపిణీ కార్యక్రమాన్ని పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ ప్రారంభించారు. శనివారం స్థానిక రాయల్ మహల్‌లో డికెటి భూములకు సెటిల్మెంట్ భూములుగా పట్టాల పంపిణీ చేశారు. ఈసందర్భంగా మండలంలో 163 మంది రైతులకుగాను 139.93ఏ పట్టాలను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులను పట్టించుకుని పాపానపోలేదని గతంలో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలుపొందినప్పుడు మొదటి సంతకం రైతుల సంక్షేమం కోసం పెట్టి బ్యాంకులలో తాకట్టు పెట్టిన పాసు పుస్తకాలు, బంగారు నగలు ఒకే సంతకంతో అందరికీ రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ మనోజ్ రెడ్డి. మాజీ మార్కెట్ చైర్మన్ ప్రహల్లాద, జడ్పిటిసిలు, సర్పంచులు, తహశీల్దార్ కుమారస్వామి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సరిత, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



రైతులకు పట్టాల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటే గౌడ

బిఎల్వోలు పోలింగ్ కేంద్రంలోనే ఉండాలి: కమిషనర్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రత్యేక ఓటర్ల నమోదు అవగాహన రోజుల్లో సంబంధిత బిఎల్వోలు వారి పోలింగ్ కేంద్రంలో నిర్దేశించిన సమయంలో కచ్చితంగా అందుబాటులో ఉండాలని ఈఆర్వో, ఆర్డీవో చిన్నయ్య, ఏఈఆర్వో కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. శనివారం ఉదయం సూపర్వైజర్ అధికారులు, బిఎల్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ మాట్లాడుతూ ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024 కార్యక్రమంలో భాగంగా తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి చిత్తశుద్ధితో కషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలో జెండర్ రేషియో, ఈపీ రేషియో నిబంధనల ప్రకారం ఉండేలా చూడాలన్నారు. 18, 19 సంవత్సరాల వయస్సు వారికి అవగాహన కల్పించి కొత్త ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఫారం -7 విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని మరణించిన, వివాహమై వెళ్ళిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారిని గుర్తించి ఫారం-బి జారీ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన చేయడంతో పాటు, సంబంధిత దస్త్రాలను సంతకాలతో సహా సేకరించాలన్నారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా అందే దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి అప్లోడ్ చేయాలన్నారు. రాష్ట్రస్థాయి ఓటర్ల జాబితా పరిశీలకులు క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నారని... ఎలాంటి పొరబాట్లకు తావు లేకుండా నిబంధనల ప్రకారం అన్ని దరఖాస్తులు, వాటికి సంబంధించిన దస్త్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఏఎస్వో సౌందర్ రాజన్, సీఎంఎం గోపి, అధికారులు పాల్గొన్నారు.

చెరకు రైతుల బకాయిలు చెల్లించాలి

'కోర్టు కమిషన్ గోబ్యాక్' అంటూ నిరసన

ప్రజాశక్తి - పిచ్చాటూరు

నింద్ర మండలం నేతమ్స్ సుగర్ ఫ్యాక్టరీపరిధిలో చెరకు రైతులకు చెల్లించాల్సిన 36 కోట్ల బకాయిలను చెల్లించేంత వరకూ పోరాడతామని చెరకు రైతుసంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ హెచ్చరించారు. ఫైనాన్స్ కంపెనీని అడ్డు పెట్టుకుని వేలం వేయనీకుండా అడ్డుకుంటూ శనివారం కోర్టు కమిషన్‌ను తీసుకురావడం దారుణమన్నారు. 'కోర్టు కమిషన్ గోబ్యాక్' అంటూ నినాదాలు చేశారు. కోర్టు కమిషన్‌ను పెద్దఎత్తున అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిఐ శ్రీనివాసంతి, ఎస్ఐ శివశంకర్ నరేష్ జోక్యం చేసుకుని పోలీసు బందోబస్తు నిర్వహించారు. రైతుల బకాయిలు నాలుగున్నరేళ్లుగా చెల్లించకపోగా, ఫైనాన్స్ కంపెనీ ఏ విధంగా ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుంటుందో సమాధానం చెప్పాలని కోర్టు కమిషనర్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా కోర్టు కమిషనర్ స్పందిస్తూ తాను కోర్టు ఆదేశాల మేరకు వచ్చానని, రైతుల బకాయిల విషయం కోర్టు దృష్టికి తీసుకెళతానని, నాలుగో తేదీన కోర్టులో వాయిదా ఉందని వెనుదిరిగారు.

టిటిడికి నిధులపై బిజెపి 'లొల్లి'

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రతి రోజూ కోట్లాది రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి కేవలం ఒక్కశాతం నిధులు తిరుపతి అభివృద్ధికి కేటాయించాలన్న నిర్ణయంపై బిజెపి 'లొల్లి' చేస్తోంది. సాక్షాత్తు కేంద్రంలోని బిజెపి మోకాలడ్డుతూ మతచాందసవాదులకు, మనుస్మృతికి ఊతమిస్తూ దేవుని పేరుతో రాజకీయాలు చేస్తోందన్న విమర్శలను మూటగట్టుకుంటోంది.

తిరుపతి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం. జగత్తులోనే అత్యంత ఆదాయం ఉన్న సంస్థ టిటిడి. తిరుమల, తిరుపతి రెండు కలిపి తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే)గా ఏర్పడింది. టిటిడికి తిరుమల శ్రీవారి హుండీ ద్వారా ప్రతి రోజూ 3 నుంచి 4 కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. ప్రసాదాల విక్రయాలు, దర్శనాలు, గదుల అద్దెలు, దాతల విరాళాలు మరో నాలుగు కోట్ల ఆదాయం. తలనీలాల విక్రయాల ద్వారా, బ్యాంకుల్లోని డిపాజిట్ల ద్వారా, బంగారు ఆభరణాలపై వస్తున్న వడ్డీ, ఇతర అనుబంధ ఆలయాల ఆదాయాలు కలిపితే ప్రతి రోజు కోట్లల్లో ఆదాయం వస్తూనే ఉంది. ఈ నిధులను స్వామివారి కైంకర్యాలకు, భక్తుల అవసరాలు తీర్చేందుకు, ఆధ్యాత్మిక ప్రచారానికి, ఆలయాల సంరక్షణకు, ఇతరత్రా అభివృద్ధికి వెచ్చించడం పరిపాటే. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా, ఏ పార్టీ పరిపాలన చేస్తున్న, ఏ వ్యవస్థ అయినా, ఏ సంస్థ అయినా అభివృద్ధి చేసేందుకే ఉన్నది. భక్తి ప్రచారానికి, భక్తుల సౌకర్యాలతో పాటు టిటిడికి చెందిన నిధులను ఇటీవల విద్యా, వైద్యానికీ అధిక భాగం ఖర్చు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణలో ఉన్న రాష్ట్రంలోనే నెంబరు వన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి స్విమ్స్‌ను టిటిడిలోకి ఈ ఏడాది విలీనం చేసుకుంది. స్విమ్స్ యూనివర్శిటీని, దానికి అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి మహిళా మెడికల్ కాలేజీ నిర్వహణ బాధ్యతలనూ చేపట్టింది. ఇవి కాక ఎస్‌వి టాటా క్యాన్సర్ ఆసుపత్రికి, అరవింద ఐ ఆసుపత్రికి టిటిడి స్థలాలు కేటాయించి సహకరించింది. ఇటీవల తిరుపతి నగరాన్ని అభివృద్ధి పరిచేందుకు రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి తిరుపతి మీదుగా తిరుమలకు వెళ్లేందుకు అవసరమైన రహదారుల, వాటికిరువైపుల ఆకర్షణీయమైన పచ్చదనం, శిల్పాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి పూనుకుంది. తిరుపతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్మార్ట్‌సిటిలో బాగంగా రూపుదిద్దుకున్న శ్రీనివాస సేతు (గరుడవారధి) నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఇలా చాలా వరకు సహకారం అందించింది. తిరుపతిని మరింత అభివృద్ధి చేసేందుకు ఇటీవల టిటిడి బోర్డు తన బడ్జెట్‌లో ఒక్క శాతం నిధులను కేటాయించేందుకు నిర్ణయించింది. అంతే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి శివాలన లేచింది. టిటిడి నిధులు తిరుపతికి కేటాయించడం అపరాదం అంటూ దూషించింది. ఏకంగా న్యాయస్థానాల తలుపులు తట్టింది. బిజెపి పార్టీ తీరు మొదటి నుంచి ఆక్షేపనీయమే. తిరుపతి అభివృద్ధికి ప్రతిదాంట్లోనూ అడ్డుపడడమే పనిగా పెట్టుకుంది. శ్రీనివాస సేతు నిర్మాణానికి నిధులు కేటాయించడం ఏమిటని ప్రశ్నించింది. సేతు పిల్లర్లకు స్వామివారి నామాలు పెట్టి అపవిత్రం చేస్తోందని విమర్శించింది. రోడ్ల నిర్మాణానికి పూనుకుంటే అడ్డుపుల్ల వేసింది. స్విమ్స్ విలీనం చేస్తే ఇదేం తీరు అని విమర్శించింది. విద్యాసంస్థలు, ఆసుపత్రుల నిర్మాణానికి స్థలాలు కేటాయిస్తే, ఇలా పంచుకుంటూ పోతే గుడులు, గోపురాలు ఎక్కడ కట్టాలని వాదించింది. ఇప్పుడు తిరుపతి అభివృద్ధికి నిధులు కేటాయిస్తే మరింత ఎక్కువ కేటాయించాలని అడగాల్సింది పోయి. అసలు నిధులే ఇవ్వొద్దని పలకడం విడ్డూరం. దేవుడిని అడ్డుపెట్టుకుని బిజెపి నీచరాజకీయాలు చేస్తోందని అన్ని రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయి. ఆఖరికి బిజెపికి మిత్రపక్షమని చెప్పుకునే టిడిపి, వైసిపి, జనసేన సైతం ఈ తీరును ఆక్షేపించాయి. సిపిఎం తొలినుంచి బిజెపి తీరును తప్పుబడుతూ అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని, సభలు, సమావేశాలు పెడుతూ తిరుపతి అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరిద్దామని పిలుపునిచ్చింది. అయినా బిజెపి స్థానిక నాయకుల తీరు విస్తుగొలుపుతూనే ఉంది. తిరుపతి అభివృద్ధికి రాజకీయాలు పక్కన పెట్టి, పార్టీలు, వ్యవస్థలు, సంస్థలు సహకరించి, తిరుపతిని మేటి నగరంగా తీర్చిదిద్దాలని ఆశిద్దాం.

ప్రమాద బీమా అందజేత

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సప్తగిరి గ్రామీణ బ్యాంక్ గ్రీమ్స్‌పేట శాఖకి చెందిన ఖాతాదారుడు, 190 రామాపురం గ్రామస్తులు వెంకటేశ్వర్లు, భార్య వి.సెల్వి ఇటీవల పొలం వద్ద జరిగిన ఏనుగుల దాడిలో మరణించారు. బ్యాంకు జనరల్ మేనేజర్ డి.ప్రభాహరన్, సిబ్బంది వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు ద్వారా యూనివర్సల్ సోంపు జెనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుండి నమోదు చేసుకున్న పర్సనల్ యాక్సిడెంట్ బీమా మొత్తం రూ.5లక్షల చెక్కును అందించారు.

ప్రమాద బీమా ఆర్థిక సాయం అందిస్తున్న బ్యాంక్ మేనేజర్

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని సావిత్రమ్మ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మనోహర్ అన్నారు. శనివారం కళాశాలలో చిత్తూరు జిల్లా శాఖ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 31మంది కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన కళాశాల విద్యార్థినులను రెడ్ క్రాస్ గౌరవ కార్యదర్శి సహదేవ నాయుడు, ఏ.ఓ. గోపి అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ రక్త సేకరణ సిబ్బంది డాక్టర్ విజయ్ కుమార్, ధరణి సిస్టర్, ప్రభు చిరంజీవి, భారతి, పాపిరెడ్డి నిజాముద్దీన్ పాల్గొన్నారు.

చింత చెట్టును ఢీకొన్న లారీ

ప్రజాశక్తి-చౌడేపల్లి: చింతచెట్టును లారీ ఢీకొన్న సంఘటన మండలంలోని చౌడేపల్లిలో చోటుచేసుకున్నది. శనివారం చౌడేపల్లి-పుంగనూరు ప్రధాన రహదారిలో చౌడేపల్లి వైపు కోళ్ల దానా తరలిస్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నది. ఈ సంఘటనలో డ్రైవర్ ప్రభు(30)కి స్వల్ప గాయాలైయ్యాయి. స్థానికులు అతన్ని 108లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్మార్గ పాలనను అంతమొందిద్దాం

- దళితులంతా ఏకం కావాలి
- టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు రాజా పిలుపు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: దుర్మార్గ ప్రభుత్వాన్ని అంతమొందించేందుకు దళితులంతా ఏకం కావాలని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు రాజా పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం జిల్లా పార్టీ కార్యాలయంలో దళిత శంఖారావం ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పీటర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు రాజా మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాలనలో దళితులపై దాడులు చోటు చేసుకుంటున్నాయన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసి దళితులకు తీవ్ర అన్యాయం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులకు పాల్పడుతున్నారని వచ్చే ఎన్నికల్లో జగన్ పాలనను అంతమందించేందుకు దళితులు పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని దళిత ప్రజా ప్రతినిధులు దళితులపై జరుగుతున్న అకత్యాలను ప్రశ్నించే పరిస్థితుల్లో లేరన్నారు. తెలుగుదేశం పాలనలోనే దళితులకు న్యాయం జరుగుతుందని రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలన్నారు. జిల్లా అధ్యక్షులు పీటర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి చంద్రబాబు నాయుడుని సీఎం చేసేందుకు జిల్లాలోని దళితులంతా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ హేమలత, పూతలపట్టి ఇంచార్జ్ మురళి, తెలుగుదేశం నాయకులు చంద్రప్రకాష్, టిడిపి నాయకులు రాజన్, జిజేఎం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి చెన్నకేశవులు నాయుడు తెలుగుదేశం ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు పీటర్

కంప్యూటర్ పరిజ్ఞానం ఆవశ్యకం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద విద్యార్థులకు సూచించారు. శనివారం కళాశాలలో కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు పొందాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమవుతోందని పేర్కొన్నారు. విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కామర్స్ విభాగ అధిపతి డాక్టర్ ఎన్.శంకర్‌రెడ్డి, వ్యాయామ విభాగ అధిపతి డాక్టర్ ఎసి భరణినాథ్‌రెడ్డి కంప్యూటర్ టెక్నాలజీ వస్తున్న మార్పులు వివరించారు. కార్యక్రమంలో ఐక్యుఎసి కోర్డినేటర్ డాక్టర్ పూడి వెంకటేష్, ప్రోగ్రాం-కోర్డినేటర్స్ కంప్యూటర్ అధ్యాపకులు ఎస్‌కె.మున్వర్, వై.శ్రీనివాసులు, ఎమ్.ఇస్మాయిల్, టి.నరేంద్రబాబు, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ డాక్టర్ సి మంగళగౌరీ, నాగేశ్వరరావు, డాక్టర్ భీమమోహన్‌రావు అధ్యాపకులు పాల్గొన్నారు.

'రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ బాబుతోనే సాధ్యం'

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఆంధ్ర రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు మాజీ సీఎం చంద్రబాబునాయుడు తోనే సాధ్యమని టిడిపి యూనిట్ ఇన్చార్జ్ పిఎస్ రఘునాథనాయుడు, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రాములు అన్నారు. మండలంలోని పాచిగుంట గ్రామంలో శనివారం బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు టిడిపి నేతలు కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో దాత దీపక్‌కుమార్ ఆలయంలో శనివారం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. దాతను పలువురు అభినందించారు.

ఉపాధి అవతవకలపై పీడీ ఆగ్రహం

- పలువురు సిబ్బందికి జరిమానా
- పారదర్శకంగా పనులు చేపట్టాలని ఆదేశం

ప్రజాశక్తి-నగరి: ఉపాధిలో అక్రమాలు జరిగితే సహించేది లేదని డ్వామా పీడీ గంగాభవాని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలో 16వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వరకు జరిగిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన ఆడిట్ వివరాలను బహిర్గతం చేశారు. కాగా మండల పరిధిలోని 21 పంచాయతీల్లో ఓజీ కుప్పం, అయనంబాకం పంచాయతీల్లో రూ.3856 రికవరీ చేయగా, 12 పంచాయతీల్లో జరిగిన పొరపాట్లకు రూ. 3750 జరిమానా వేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 21 పంచాయతీల్లో రూ.9.66 కోట్ల మేర ఉపాధిహామీ పనులు జరిగిందన్నారు. వీటిలో వేతనాలకు రూ.8.12కోట్లు వెచ్చించగా, మెటీరియల్‌కు రూ.1.54కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు. గ్రామస్థాయిలో ఉపాధి పనుల్లో కొన్ని అవకతవకలు జరిగినట్లు కనుగొన్నామని రికవరీలు చేయడం, జరిమానా విధించడం జరిగిందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు రికార్డులను తనిఖీ చేయాలని, పారదర్శకంగా పనులు చేపట్టేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంపీపీ భార్గవి, డీవీవో భాగ్యలక్ష్మీ, నగరి క్లస్టర్ ఏడీ శోభన్‌బాబు, ఎంపీడీవో లీలామాధవి, వైఎస్ ఎంపీపీ కన్నియప్ప, ఏపీవో కవిత, ఎస్టీయం కోనయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తుల పేర్లు నమోదు చేయాలి

- అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటప్రసాద్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: వ్యాధిగ్రస్తులను పేర్లను నమోదు చేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకట ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం అనుబంధంగా ఉన్న లింక్ ఏఆర్టీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి, లెప్రసీ, టీబి పరీక్షలు చేసి వారికి తగిన మందులు పంపిణీ చేయాలని వారి పేర్లను వారికి అందిస్తున్న మందుల వివరాలను నమోదు చేయాలన్నారు. వారిని క్రమం తప్పక మందులు ఉపయోగించే విధంగా చూడాలని వారు కేంద్రానికి వచ్చినప్పుడు తగిన పరీక్షలు చేసి వ్యాధి పై సమాచార ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి శిరీష, డిప్యూటీ పారామెడికల్ అధికారి మణి, ఐసిటిఎస్ కౌన్సిలర బాబు, సిబ్బంది జయచంద్ర, ప్రకాష్, భావన తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వమే కొనసాగించాలి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వమే కొనసాగించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని, ఆసుపత్రిలో అన్ని విభాగాలకు ప్రభుత్వానికి సంబంధించి నైపుణ్యం కలిగిన డాక్టర్లను, టెక్నీషియన్స్, సిస్టర్లను, ఆస్పత్రి స్థాయికి తగ్గ సిబ్బందిని నియమించాలని కోరుతూ సిపిఐ నగర కార్యదర్శి విసి. గోపీనాథ్ ఆధ్వర్యంలో శనివారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కేంద్రంలో ఉన్న చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం గత ప్రభుత్వం అపోలో యాజమాన్యానికి ప్రభుత్వ ఆసుపత్రిని 33 సంవత్సరాలకు లీజుకు ఇస్తే, ఆసుపత్రికి చుట్టుపక్కల మండలాల నుండి వైద్యంకోసం వస్తున్న పేషంట్లకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వస్తున్న పేషెంట్లకు చిన్న జబ్బులకు సైతం పరీక్షలు చేయకపోగా ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని ఈవిధానం సరైనది కాదని అన్నారు. ఇకనైనా ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వమే కొనసాగించి పేద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు నిత్యజీవితంలో వినియోగించే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని, చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు, తల్లిదండ్రులకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించాలని తద్వారా వాతావరణ కాలుష్యాన్ని కాపాడాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగపు ప్రొఫెసర్ ఆచార్య కే. రమ్య కుబేర్ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో శబరి వసతి గృహం వద్ద శనివారం ఆమె మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ పి.లక్ష్మి , విద్యార్థులు, హాస్టల్ కార్మికులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో విదేశీయులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం జర్మనీ, ఫ్రాన్స్, మారుసిస్, ఇటలీ, ఆస్ట్రేలియా చెందిన 120 మంది భక్తులు విచ్చేశారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణీ రెడ్డి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేద పండితులచే ఆశీర్వాదం చేయించి ప్రతి ఒక్కరికి కండువా కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం విదేశీ భక్తులు మాట్లాడుతూ సంప్రదాయానికి ఆకర్షితులై తామందరం భారత దేశంలో వివిధ దేవాలయాలు సందర్శిస్తున్నామని చెప్పారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా వుందన్నారు. మకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మూర్తి స్వామి, చిన్న రావు, ఆలయ ఈవో రామారావు పాల్గొన్నారు.

సునీతా సేవా సంస్థ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని రాజావీధిలో ఏర్పాటైన సునీతా సేవాసంస్థ కార్యాలయాన్ని ఎస్.కె.ఆర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు ఉమన్ ఎంపవర్ మెంట్ లో భాగంగా క్షేత్ర పర్యటన చేశారు. మహిళాభివృద్ధి, మహిళా సాధికారత కోసం వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ, వాటికి సంబంధించిన రికార్డులు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కళాశాల హెడ్ ఆఫ్ డిపార్ట్ మెంట్ జాన్సీవాణి మాట్లాడుతూ నిస్వార్థ సేవా కార్యక్రమాలను సునీతాసేవా సంస్థ ప్రతినిధులు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి, అధ్యాపకులు శైలజ, కిరణ్మయి, లక్ష్మి, వాణి, లక్ష్మీ హిమబిందు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం వల్ల కాలుష్య నియంత్రణ

ప్రజాశక్తి -రేణిగుంట : మొక్కలు నాటడం వల్ల కాలుష్యం నియం త్రిం చవచ్చని శ్రీరామ ఇంజినీరిం గ్ కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం రేణిగుంట మండలంలోని కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని కళాశాల జాతీయ సేవ విభాగం ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిబిఎస్ఆర్ గ్రూప్ అధినేత హ్యూమన్ రైట్స్ కమిషన్ మెంబర్ పి మనోహర్ రెడ్డి విచ్చేసి కాలుష్యం నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాతావరణంలో కాలుష్యం పెరిగితే అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందు కుమార్ రెడ్డి, కోఆర్డినేటర్ ఎన్ వాసు, కన్వీనర్స్ కుమారి జమీల, డి పూర్ణచంద్ర రెడ్డి, జాతీయ సేవ విభాగం ఆఫీసర్ ఎస్ చక్రిశ్రీధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

11, 12 తేదీలలో డైట్‌లో కళాఉత్సవ్ పోటీలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో ఈ నెల 11, 12తేదీలలో జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలు నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ అన్నారు. శనివారం కళాశాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య సంస్థలకు చెందిన అన్ని రకాల పాఠశాలలు, అలాగే జూనియర్ కళాశాలలో 9,10,11,12 తరగతులు చదువుతున్న విద్యార్థులు డైట్లో జిల్లా స్థాయిలో నిర్వహించే కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. మొత్తం 10కళారూప పోటీలు ఉంటాయని, అందులో గాత్ర సంగీతం, వాద్య సంగీతం, నాట్యం విభాగాలకు చెందిన పీటీలు 11వ తేదీన నిర్వహిస్తారన్నారు. సాంప్రదాయ బద్ద ఆటబొమ్మల ఆటలు, నాటకం(ఏకపాత్రాభినయం) వంటి పోటీలు 12వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒక విద్యా సంస్థ నుంచి ఒకొక్కక్క కళారూపంలో ఒక బాలుడు. ఒక బాలిక మాత్రమే విడివిడిగా పాల్గొన్నాలని పేర్కొన్నారు. 2022 సంవత్సరం కళాఉత్సవ్ పోటీల్లో ప్రథము ద్వితీయ, తతీయ బహుమతులు పొందిన విద్యార్థులు ఈ సంవత్సరం పాల్గొనేందుకు అనర్హులన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమకు కావాల్సిన సామగ్రిని వారే తీసుకురావాలని సూచించారు. ప్రతి కళాకారుని ప్రదర్శనకు 5 నిమషాలు మాత్రమే ఇవ్వడం జురుగుతుందన్నారు. కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొనేందుకు ఆశక్తి కలిగిన విద్యార్థులు డైట్ కళాశాల బోధనా సిబ్బంది నిర్మల -9985837519 నంబర్కు, అలాగే 9492633001, 7780229110 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అలరించిన చిన్నారుల నాట్యం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని పెద్దకాల్వలో నూతనంగా నిర్మించిన శ్రీ సత్తెమ్మ ఆలయ మహా కుంభాభిషేక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో చిత్తూరు పట్టనానికి చెందిన శ్రీ వెంకటేశ్వర క్లాసికల్ డాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారుల నృత్యం పలువురిని ఆకట్టుకొనింది. గ్రామస్తులు చిన్నారులను, డాన్స్ అకాడమీ యాజమాన్యాన్ని అభినందించారు.

మామిడి రైతులు పంట బీమా చేసుకోవాలి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల 'మామిడి రైతులకు పంట నష్టం వాటిల్లుతోందని, ఈ పంట నష్టం నుంచి ఆదుకునేందుకు ప్రభుత్వం అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా '(ఎఐసి) ద్వారా తక్కువ ప్రీమియంతో అందిస్తున్న 'సంపూర్ణ బీమా రీతూ కవచ్'ను సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన శాఖాధికారి శివకు మారి మామిడి రైతులకు సూచించారు. చిన్నగొట్టిగల్లు మండల మామిడి రైతులతో శనివారం సమావేశం నిర్వహించి మామిడిలో చీడ పీడలు, సస్య రక్షణ, బీమా తదితరాల పై అవగాహన కర్పించారు. ఆమె పంట బీమా తప్పనిసరిగా చేసుకోవాలని వివరించారు. ఈ రబీ కాలం 2023-24 సంవత్సరానికి ఎకరానికి రూ.1461 ప్రీమియం కట్టాలని, 14 డిసెంబరు 2023 లోగా బీమా తీసుకోవాల్సి వుంటుందన్నారు. 15 డిసెంబర్ 2023 నుండి 31 మే 2024 మధ్య కాలానికి ఈ బీమా వర్తిస్తుందని, బీమా మొత్తాన్ని ఎఐసి రూపొందించిన యాప్(సరూస్)ద్వారా భూమి పాస్ బుక్ , బ్యాంకు పాస్ , ఆధార్ కార్డు, కౌలు సర్టిఫికెట్ లతో ఎఐసి ఏజెంట్లు, మైక్రో ఇన్సూరెన్స్ ఏజెంట్లు, పిఎస్ పి ల ద్వారా బీమా ప్రిమియం చెల్లించి పంట బీమా తీసుకోవచ్చని తెలిపారు.

క్రికెట్‌లో జాతీయ స్థాయికి ఎంపిక ప్రశంసనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణానికి చెందిన దివ్యాంగుడు అవినాష్ జాతీయ స్థాయిలో క్రికెట్ జట్టులో స్థానం సంపాదించి దేశం తరపున ఆడటం గర్వకారణంగా ఉందని సీనియర్ రొటేరియన్, వైసిపి సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలు ఆడిటోరియంలో దివ్యాంగుడు అవినాష్ జాతీయ స్థాయిలో క్రికెట్ జట్టుకు ఎంపిక కావడంతో రోటరీక్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, క్లబ్ ప్రతినిధులు కలిసి అవినాష్ కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ సందర్భంగా ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత క్రికెట్ పై మక్కువ చూపుతున్నారన్నారు.

ఓటు పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి

- పోలింగ్ కేంద్రాల తనిఖీల్లో సిబ్బందికి జేసి సూచన
- జిల్లాలోని పలు కేంద్రాల్లో ఉన్నతాధికారుల తనిఖీలు

పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-సదుం: ఓటు నమోదు పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం సదుం తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. తదుపరి 180 నుంచి 185 ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బూత్ లెవెల్ ఆఫీసర్స్‌కు, సచివాలయ సిబ్బందికి ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై గురించి సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ వీరబద్ర, సదుం జెడ్.పి. హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయిలు సుబ్రహ్మణ్యం, జయకుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురంలో డిప్యూటీ కలెక్టర్ తనిఖీలు

వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ కలెక్టర్

ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 136, 137,138 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటి కలెక్టర్ భవాని తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త ఓటర్ల చేర్పులు, మరణించిన వాళ్ల, ఆడపిల్లలు పెళ్లై వెళ్లిపోయిన వాళ్లను తొలగించారా లేదా? జంక్ వోటర్స్ కరెక్షన్స్ చేశారా? అని మండలరెవెన్యూ అధికారి బెన్ను రాజు, బిఎల్‌వోలు శేఖర్, కనకరాజు, మునినాదయ్యలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఒడ్డుపల్లి ప్రాథమిక పాఠశాల ఆరిమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేశారు. వీరి వెంట సూపర్వైజర్ నరసింహులు ఆర్ఐ ప్రభాకర్, సర్వేర్ మురళి, కొత్తపల్లి మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శాంతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు నగరంలో కమిషనర్ తనిఖీలు

ఓటు నమోదు వివరాలను ఆరాతీస్తున్న కమిషనర్ అరుణ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: బిఎల్వోలు తమకు అందే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో విచారించి దస్త్రాలను జత చేయడంతో పాటు సంబంధిత వ్యక్తుల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని ఏఈఆర్వో, కమిషనర్ డాక్టర్ అరుణ స్పష్టం చేశారు. శనివారం ఈఆర్వో, ఆర్డీవో చిన్నయ్యతో కలిసి నగరంలోని సంతపేట, కట్టమంచి, దొడ్డిపల్లి ప్రాంతాల్లోని 36, 33, 32, 29, 34, 35, 18, 19, 20, 27, 12, 13 పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రత్యేక ఓటు నమోదు అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. బిఎల్‌ఓ ల వద్ద ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. ఫారం- 6, 7, 8, 8ఎ దరఖాస్తులు ఎన్ని వచ్చాయి? దరఖాస్తులకు సంబంధించి దస్త్రాలు సమర్పించారా లేదా? సంతకాలు చేశారా వంటి వివరాలను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఓటర్ నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరబాట్లకు తావివ్వరాదని సిబ్బందికి సూచించారు. సూపర్వైజర్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఏసిపీ రామకష్టుడు, సీఎంఎం గోపి, బిఎల్వోలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లిలో ఆర్డీవో తనిఖీలు

పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డివో మనోజ్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి పాతూరు పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు కేంద్రం పలమనేరు ఆర్‌డిఓ మనోజ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిఎల్‌ఓలను ఉద్దేశించి మాట్లాడుతూ ఓటరు నమోదు చేసేందుకు వచ్చేవారిని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేయాలన్నారు. అలాగే మరణించిన వ్యక్తులను గుర్తించి తొలగించేందుకు ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఎలాంటి తప్పులు ఒప్పులు తలచిన కఠిన చర్యలు తప్పవని బిఎల్‌ఓలను హెచ్చరించారు, కార్యక్రమంలో తహశీల్దార్ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే సాధికారత

ప్రజాశక్తి-కార్వేటినగరం: సామాజిక సాధికారతను ఆచరణలో చూపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మండల వైసిపి కన్వీనర్ శేఖర్‌రాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని కొల్లగుంట సచివాలయంలో ఏపీకి జగనన్నేనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ దివ్య, ఎంపిటీసీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. కన్వీనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. సీఎం అందించిన సంక్షేమాలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని. రానున్న ఎన్నికల్లో తిరిగి జగనన్నకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, పురంధర్, మునికృష్ణ, సుబ్రమణ్యం, గాంధీ, అయ్యప్ప, ఈవోపీఆర్టీ లక్ష్మీపతి, కార్యదర్శి లోకేష్ పాల్గొన్నారు.

అమ్మో.. కొండ చిలువ.. ఉరకండ్రోయ్.!

- సోమలలో పది అడుగుల పాము ప్రత్యక్షం
- భయంతో కొట్టి చంపిన స్థానికులు



ప్రజాశక్తి-సోమల: తుఫాను ప్రభావంతో అప్పుడప్పుడే వర్షం మొదలైంది.. పనుల మీద బయటెళ్లిన స్థానికులు ఒక్కరొక్కరుగా తడుస్తూ ఇండ్లకు చేరుకుంటున్నారు.. వాహనాల రాకపోకలతో చిన్నపాటి వెలుతురులో ఓ స్థానికుడు శనివారం రాత్రి సరిగ్గా 8గంటల సమయంలో సోమల బజారు వీధిలోని పీర్ల చావిడి వద్ద కొండచిలువను గుర్తించారు. అమ్మో కొండ చిలువ రా.. బాబోయ్.. ఉరకండ్రా అంటూ కేకలు వేశాడు. దీంతో ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకున్నారు. పదిఅడుగుల కొండచిలువను చూసి భయాందోళన వ్యక్తం చేశారు. వీధి దీపాలు కూడా లేవని, పిల్లలు, వృద్ధులు, మహిళలు సంచరిస్తున్న ప్రదేశంలో కొండచిలువ సంచారంపై ఒకింత ఆందోళనకు గురైయ్యారు. చివరాకరికి ఆ కొండచిలువని అక్కడివారు కొట్టి చంపారు.